

ప్రియావలోకనము

కాండ్రేగుల రామచంద్రరావుగారు, బి.ఎ.

పాంచాలదేశమందలి కొండ ప్రదేశములలో నొక సుందరమైన వనము కలదు. అది వసంతర్తు వగుటచే చెట్లన్నియు పచ్చనియాకులతో నిండియుండెను. పుష్పజాతులు వనమునందంతటను మనోజ్ఞ సుగంధమును వెదజల్లుచుండెను. కోయిలలు మధురగానము లొనర్చుచుండెను. ఆ వన మధ్యమున నొకకోన గలదు. ఆ సామీప్యముననే ఒక పటకుటీరము నేత్రానందకరముగ నుండెను. ఒకనాటి ఉదయకాలమున రసపుత్రయోధు డొకడు సాయుధుడై, అశ్వముపై స్వారిచేయుచు వచ్చి, ఆ కుటీరము ప్రక్కనే గుఱ్ఱముదిగి, ఒకచెట్టునకు దానిని కట్టివేసి, కుటీరద్వారముకడ కేగి, తన కరవాలముతో ముమ్మారు తలుపుపై గొట్టెను. వెంటనే కవాటము తెరువబడెను. యౌవనవతియగు నొక రమణీమణి చిరునగవుతో నాతని సమీపించి, అర్ఘ్యపాద్యాదు లొసంగి, సుఖాసీనుం జేసి; ఆతని ప్రక్కనే నునుసిగ్గుతో నిల్చియుండెను.

"సుందరీ! నీలో నే డేమియో నూత్న సౌందర్యము పొడసూపుచున్నదే. అదేమో కాని, యిచ్చటకు వచ్చి నిన్ను గాంచని దినమున మన మెంతయు కలకబారి, పిచ్చివానివలె తిరుగుచు, నా విధ్యుక్తధర్మమునే మరచుచుందును."

"విజయా! అది ప్రణయ లక్షణమేగదా! ప్రేమాస్పదులగు యువతీ యువకులు ఒండొరులను బాసి సహింపగలరా?"

"నీ వనినమాట నిక్కువము. నీదర్శనభాగ్య మబ్బిన దినమున యుద్ధములో సంపూర్ణ జయ మొందుచుంటిని. లేనినాడు, అది యేలొకో కాని, శాత్రవులు నా సేనపై కురికి, నా వారిని తమ వాడి కరవాలముల కెరగా చేయుచుందురు."

"ఇంకను యుద్ధ మెన్ని నాళ్లు సలుపవలెను?"

"అది యేమి చెప్పగలను? శత్రుసంహారము పూర్తి యగువరకు యుద్ధభూమి వీడుటకు వీలు లేదు."

"అట్లగుచో నిచ్చోట నున్నంతకాలము తమ దర్శనభాగ్యము కల్గునని యాశించుచుంటిని."

"సుశీలా! నిన్ను బాసి నే నుండగలనా? వీలగునప్పుడెల్ల వచ్చుచునే యుండగలను. చాల ప్రొద్దుపోయినది. సైన్యాధ్యక్షుడు నాకై ప్రతీక్షించుచుండును. నీ తండ్రి గృహమునకు వచ్చు వేళగూడ సమీపించుచున్నది. పోయి వచ్చెద"నని, ఆమె నాలింగనమొనర్చి, అధరసుధారసముం గ్రోలి, తిరిగి అశ్వారూఢుడై అతడు చిటికలో మాయమయ్యెను. ఆ కుసుమకోమలియు విజయుని గుఱ్ఱపు డెక్కల ధ్వని వినవచ్చునంతవరకు నచ్చోటనే యుండి, ఆపిదప తన పెంపుడు లేడి పిల్లను ముద్దుగొని లోని కేగెను.

౨

సుశీల నందవంశీయుడగు మాధవుని యేక పుత్రిక. నవయౌవనవతి. సుకుమారశరీర. అపూర్వ సౌందర్యవతి.

పాపము, చిన్నతనముననే తల్లి స్వర్గస్థురాలయ్యెను. నాటి నుండియు సర్వము దానయై, మాధవుడామె నతిగారాబముతో పెంచుచుండెను. మాధవుడు మహాపద్మనందుని కొలువున ఉన్నతోద్యోగమునం దుండెను. కాని కాల మహిమ కొనియాడ నేరితరము! నందుని కుమారులు చాణక్యుని నిండు సభలో నవమానపరచుటచే నాతఁడు వారిని రాజ్యభ్రష్టులుగ చేయ శపథ మూని, పద్మనందుని యాగ్రహమునకు గురియైన చంద్రగుప్తుని జేరి, సైన్యములు చేకూర్చి వారిపై కత్తికట్టెను. ఆనాటినుండియు దేశములో రెండుపక్షము లేర్పడెను. రాజభక్తులెల్లరు నందుని పక్షము. దేశభక్తులెల్లరు చాణక్యునిపక్షము. నానాటికి చంద్రగుప్తుడు పరదేశీయులగు యవనులను జయించి, రాజ్యము నాక్రమించుకొనుచుండెను. మాధవుడు నందపక్షపాతి. అతఁడు చంద్రగుప్తుని దినదినాభివృద్ధి గాంచి, రాచకొలువు చాలించుకొని, రహస్యముగా వనవాసము చేయుచుండెను. తాను నందపక్షపాతి యని పరులెవ్వరికి తెలియకుండ కాలక్షేపము చేయుచుండెను. ఇట్లుండ నొకనాడు మాధవుడు తనయేకపుత్రికయగు సుశీలను వీడి దూరదేశము కార్యార్థియై పోయెను. అట్టి సమయమున యోధుడొకడు కొలదిమంది సైనికులతో త్రోవతప్పి, సాయంతన మగుటచే ప్రయాణము సాగించుటకు వీలు లేక, ఆ పటకుటీర ప్రాంతమున విడిసెను. కుటీరమునం దెవ్వరో యుండెదరని గ్రహించి, యం దేగుదెంచి సుశీలం గాంచెను. ఆమెయు నాతని కర్ఘ్యపాద్యాదు లొసంగి, యేవియో కొన్ని రసఫలములను, క్షీరములను ఒసంగి, అతిథిపూజ యొనర్చెను. ఆయువతీయువకులు ప్రథమావలోకనము వలననే పరస్పరానురాగులైరి. ఆనాటినుండియు విజయుడు నిత్యము సుశీలాదర్శనాపేక్షితుడై వచ్చుచు పోవుచుండెను. సుశీలతండ్రి నందపక్షపాతియని గ్రహించినపుడు విజయుడు చాల కటకటంబడెను. ఈతడు చంద్రగుప్తుని పక్షమూనెనేమో? తండ్రి లేనిసమయముననే వచ్చి, కొంతకాల మామెతో గడపుచుండెడివాడు. వారి ప్రణయము నానాటికి అధికము కాజొచ్చెను. శకుంతలాదుష్యంతులవలెనే, వీరిద్వురకు గాంధర్వవిధిని వివాహమయ్యెను. ఈ విషయము తండ్రికిమాత్రము తెలియదయ్యె. ఈ విజయుడె పైని వర్ణింపబడిన యోధుడని చదువరులీవరకే గ్రహించియుందురు.

3

మాధవుడు దూరప్రయాణమొనర్చి అప్పుడే వచ్చియుండెను. అతడు చాల డస్సియుండుటయేకాక, మిగుల చింతాక్రాంతుడై యుండెను. సుశీలయు తండ్రిని చూచి మిగుల దిగులొందుచుండెను.

"అమ్మా! చాణక్య చంద్రగుప్తుల విజయధ్వని దిగంతముల ప్రాకుచున్నది. మనకు సామీప్యముననే శత్రుసేనలు విడిసియున్నవి. మన మిచ్చోట నుంటె మని వారికి తెలిసెనా, మన ప్రాణములు మనకు దక్కవు. కనుక రేపు ప్రాతఃకాలముననే యిచ్చోటు బాసిపోవలెను." అని యతడు చెప్పెను. సుశీల మనస్సు చివుక్కు



మనెను. ప్రాణరక్షణార్థమై అచ్చోటు బాసి పోవుట న్యాయమే. కాని తన ప్రాణప్రియుడు తిరిగి తన కెట్లు కాన్పించును? వీ రెచ్చటికి పోయినది ఆతని కెట్లు తెలియును? పోనీ, అతనికి వర్తమానమంపుదుమన్న, తన రహ

స్యము వెల్లడియగునుగదా! కన్నుమ్రాయుచున్న, తన ప్రియుడెవ్వరో, ఆతని వాసస్థలమెద్దియో ఆమెయెన్నడు కనుగొనియుండలేదు, తన పేరు "విజయు"డని మాత్రము ఆతడు నుడివియుండెను. ఇపుడు కర్తవ్యమేమి? తావిూ స్థలము విడిచిపోవుచున్నట్లాతనికి తెలియుటెట్లు? ఆమె దీర్ఘాలోచనచేసి తుదకిట్లు తెంపుజేసెను: "విజయుడు సైన్యమునందే యుండును. సైన్యము సమీపమునందే విడిసియుండెనని తండ్రి చెప్పెనుగదా! రాత్రిసమయమున నేనొక్కతనే పోయి, ఆతని నచ్చోట కలిసికొని, యీ విషయ మాతని కెరుకపరచెదను".

౪

రాత్రి గాఢాంధకారముగ నుండెను. పదిగంటలు దాటిపోయెను. యుద్ధక్షేత్రమందలి డేరాలలో సైనికనికాయమంతయు విడిసియుండెను. చాలమంది భోజనాదికృత్యములను గావించి శయ్యలపై జేరిరి. అంతయు నిశ్శబ్దముగ నుండెను. అట్టి సమయమున నంగనామణియొర్తు శరీరమునిండ బట్టకప్పుకొని మేలిముసుంగు వైచికొని, ఆ డేరాలమధ్యనుండి యేదియో వెదకుచున్న దానివలె బోవుచుండెను. ఆమె రెండు మూడు డేరాలను వీక్షించి, తనకు వలసిన వస్తువు లభింపమి, నిస్పృహ చెందుచు, తిరిగి మరియొక డేరాలోనికిబోవ సమకట్టుచుండెను. ఇంతలో "సుశీలా" యని యెవ్వరో సంబోధించినట్లాయెను. వెనుదిరిగి చూచునప్పటికి విజయుడు సాక్షాత్కరించెను. ఆమె యాతని వక్షమునజేరి దుఃఖాశ్రువులు రాల్పసాగెను.

"సుశీలా! ఇంత రాత్రివేళ నొంటరిగా నేల వచ్చితివి? కంట నీరిడుచుంటివేమి?"

సుశీల చాలవరకేమియు పలుకలేదు. రెప్పవాల్పక యాతని ముఖమునంక చూడ దొడంగెను. శరీరమంతయు కంపమొందుచుండెను.

"ఏమి, పలుకకుంటివి?"

"విజయా! నీకొరకే వచ్చితిని. మన మొకరినొకరు వీడిపోవలసిన దురదృష్టము సంభవించినది. శత్రువులు తన్ను కనుగొందురను భీతిచే మా జనకుడీవనమును బాసి పోవ నుద్యమించెను."

"ఎప్పుడు?"

"రేపుదయముననే పోవలయునట. ఈ సంగతి నీకు దెలిసియుండిన ఆశాభంగము కలుగకుండునని తోచి యిటు వచ్చితిని."

"ఇకముందెచ్చట నివసింప దలంచెను?"

"ఆ సంగతి నాకేమియు చెప్పలేదు. నాకేమియు తోచకున్నది. మనము తిరిగి కలిసికొనుట యెన్నడో?"

"ప్రేయసీ! భీతిల్లకుము. నీవెచ్చట నున్నను నీప్రియుడు రెక్కలు కట్టుకొని వ్రాలునని నమ్ముము."

"మనోహరా! మన మీ కష్టముల పాల్పడకుండ నుండుటకు వీలులేదా? వెంటనే నన్ను నీయొద్ద చేర్చుకొనరాదా?"

"అది నాకంగీకారమే! కాని ప్రస్తుత మీ యుద్ధభూమియందు జీవనము గడపుచు, నిన్ను చేకొని యెచ్చట నుంచుదును? అదియుంగాక, సైనికులు స్త్రీలోలురై యుండకూడదను శాసనమున్నది యెఱుగవా?"

"అట్లయిన, నే నీవిధముగ నెంతకాల ముండవలయును?"

"యుద్ధము ముగిసినవెంటనే నిన్ను తప్పకగొనిపోయి నా గృహము చేర్చెదను. అందాక—"

"అది యెన్నడో? ఈలోన మీకు బిడ్డకలిగిన—"

"భయపడకుము. ఈలోననే వచ్చి కొనిపోయెదను. చాలరాత్రి గడచినది. నా అశ్వశకటము నెక్కిపొమ్ము. అది నిన్ను మీగృహసమీపమున విడిచివచ్చును.

"వద్దు-వద్దు- నేను కాలిబాటనే పోయెదను. విజయా! నన్ను మరువవు గదా?"

విజయుడు ఆమెను తన బాహువులలో చేర్చికొని విశాలఫాలభాగమును తనహస్తముతో రాయుచు, ముద్దుగొని వీడ్కొల్పెను. ఆమెయు మెలమెల్లగ నేగుచుండెను. ఇంతలో విజయుడు తిరిగివచ్చి, ఆమె నాలిం

గనమొనర్చి, తన అశ్వముపై నిడికొని ఆమె గృహసమీపమున దింపెను.

"విజయా! ప్రతి నిమిషము నీకై యెదురుచూచుచుండెదను. నా ప్రాణములు నీ చేత నున్నవి. జ్ఞాపకముండునా?" అని చెప్పుచు, ఆ గాఢాంధకారములో నదృశ్యమాయెను.

౫

నెలలు గడచిపోయెను. సుశీలకు ఆరవమాసము కూడ వెళ్ళిపోయెను. ఆమె తండ్రి కీసంగతి యేమియు తెలియకుండెను. ప్రియుడింకను తన్ను చేరకపోవుటవలన సుశీల చాల కటకటం బడుచుండెను. ఈలోన దేశములో చాలమార్పులు కలిగినవి. చంద్రగుప్తుడు యవనులను పాంచాలమునుండి పారద్రోలి చాణక్యసహాయమున ఉత్తర హిందూస్థానమంతయు జయించి నందవంశీయుల నందరి నాశ మొందించి, మగధరాజ్యమునకు పట్టభద్రుడాయెను. ఆ కారణమున సుశీలామాధవులు తమ ప్రాణము లర చేతులం దుంచుకొని యేనిముషమున కేమి వాటిల్లునోయని మిక్కిలి భయపడుచుండిరి. తన ప్రియుడు త్వరమైన రాయడయ్యెనని సుశీల చాల దుఃఖించుచుండెను. ఆ సమయమున నే సైనికుడొకడు లేఖ నొకదానిం గొని తెచ్చి సుశీల కొసంగెను. ఆమె యాతురతతో దానిని విప్పి యాక్రిందివిధముగ జదివికొనెను—

"సుశీలా,

నిన్ను సందర్శింపవలెనని చాల యత్నించితి. మీరున్న ప్రదేశముకూడ నాచారులవలన గ్రహించితి. కాని దేశములో కలిగిన మార్పులవలన నా కార్యభార మధికమాయెను. ఇకముందు నిన్ను చూడగల్గుదునన్న యాశలేదు. మనకు కలుగబోవు బిడ్డనుగూర్చి నాకు వీలగునంతవరకు శ్రద్ధతీసికొందును.

—విజయుడు"

ఈ ఉత్తరము చూచుటతోడనే, సుశీల మొదలు నరకిన కదళీ వృక్షమువోలె నేలగూలెను. "బిడ్డనుగూర్చి వ్రాసెను. కాని తల్లిగతి యేమికావలయును?" కొంతవర కామె స్పృహతప్పి పడియుండెను. ఉత్తరము కూడ నామె ప్రక్కనే గాలి కెగురుచుండెను. ఇంతలో ఆమె



తండ్రి అచటి కరుదెంచి నేలపై పడియున్న తనూజను, ఆమె ప్రక్కనేయున్న ఉత్తరమును కనుగొనెను. తోడనే ఆ లేఖందీసి ఆమూలాగ్రముగ జదివికొని నిర్వేరజెందెను. సుశీల కన్నుల విప్పెను. ఎదుటనున్న తండ్రిని కనుగొని లజ్జా భయములు తన్నావహింప, తల వంచుకొనియెను.

"సుశీలా! ఈ లేఖమూలమున నీవు చెప్పకుండగనే సర్వము విదితమయ్యెను. నీవొనర్చిన కార్యము మన క్షత్రియ కులధర్మమునకు దగియే యున్నది. కాని యీ విజయు డెవ్వరు?"

"తండ్రీ! క్షమింపుము. అతని విజయుడనుట తప్ప ఆతడెవ్వరో నాకు దెలియదు. అతనికి నా యాత్మను ప్రేమపూర్వకముగ సమర్పించియుంటిని"—

"ఎంత వెఱ్ఱిదానవు! అతని వంశనామము లెవ్వియో తెలియకుండ నేల చేపట్టితివి?—దీనివలన నీ కగు నష్టమేమియో గ్రహించితివా? నీ బిడ్డ అనామకుడై తండ్రికి దూరస్థుడై యుండవలసివచ్చును—"

సుశీల యేమియు మాఱు పలుకలేదు. కాలము గడచిపోవుచుండెను. ఆమెకు పదిమాసములు నిండెను. ఒకశుభముహూర్తమున ఆమె కొక తేజోవంతు డగు పుత్రు డుదయించెను. ఆతని కేమియు పేరిడలేదు.

దేశములో కల్గిన మార్పులవలన నందవంశీయుఁడగు మాధవునకు కష్టదినములు సంప్రాప్తమాయెను. శత్రువు లాతని వెనుకి పట్టుకొనిరి. ఆతనిపై నభియోగము దెచ్చి న్యాయస్థానమున విచారణ జరుప నెంచిరి. సుశీల చాల దుఃఖితయై యుండెను. నేడో రేపో విచారణ ప్రారంభ మగునని తలచుచుండిరి. ఇంతలో నెవరో యొక సేవ కుడు ఒక లేఖం గొనివచ్చి మాధవున కొసంగెను అం దిట్లుండెను—

"దీనియందు అనుమతిపత్రము కలదు. దీనివలన మీరు వెంటనే ఈదేశము వీడి పోవచ్చును మిమ్ముల నెవ్వరు నిరోధింపరు. విజయుని కోర్కెవలన నిది మీకొసంగబడెను. చంద్రగుప్త."

దానింజూచి, సుశీలామాధవులు చాల సంతసించి, కరుణార్ద్రహృదయుఁడగు చంద్రగుప్తుని కొనియాడుచు, నాఁడే దేశము వీడి, దక్షిణదేశమునకు బోయిరి.

౬

రెండేండ్లు గడచెను. సుశీల కుమారుఁడు శుక్లపక్ష చంద్రునిరీతి దినదిన ప్రవర్ధమాను డగుచుండెను. తల్లికిని, తాతకును తన బాల్యచేష్టలచే చాల నానందము చేకూర్చుచుండెను. కాని సుశీలమాత్రము భర్తృవియోగముచే చాలకృశించి, ఖిన్నురాలై యుండెను. ఎట్లయినను తన బాలుని తండ్రిని కనుగొను ఉద్దేశముతో తిరిగి ఉత్తర దేశమునకు పోవమని సుశీల ప్రోత్సహించుటచే మాధవు డంగీకరించెను. తిరిగి పది దినములలో పాంచాలదేశము చేరిరి. కాని వెంటనే యాతడు నందవంశీయు డని గ్రహించి పాంచాల దేశాధికారి, మాధవునకు ఉరిశిక్ష విధించి, చక్రవర్తి యాజ్ఞకై నిరీక్షించుచుండెను. కాని నియమితకాలము గడచిపోయినను చక్రవర్తి యొద్దనుండి యేమియు నాజ్ఞ రాదయ్యెను. అందుచే నొక యుదయమున మాధవుని ఉరిస్తంభ మెక్కించిరి. సుశీలయు, ఆమె చిన్నికుమారుడును ప్రక్కనే నిల్చి కన్నీరు మున్నీరుగా నేడ్చుచుండిరి. ప్రజలెల్లరు గుమిగూడి చాల విచారించుచుండిరి. ఇంకొక నిమిషములో మాధవుని తల తెగిపడుటకు సిద్ధముగనుండెను. ఇంతలో దూరమున గుఱ్ఱపుడెక్కల ధ్వని వినవచ్చెను. శరవేగమున అశ్వికుఁడొకఁడు చనుదెంచి, "ఆగుడాగుడు-



చక్రవర్తి యాజ్ఞ" అనుచు, అశ్వమవరోధించి, యొక యాజ్ఞాపత్ర మధికారిచేత నుంచెను. అది యాతడు పరిశీలించి, మాధవుని ఉరిస్తంభమునుండి క్రిందకు దింపి, యాతనిచేతికి చక్రవర్తియాజ్ఞాపత్ర మందించెను. దానిని చూచుటతోడనే మాధవుడు మందహాసమొనర్పసాగెను. చంద్రగుప్త చక్రవర్తి యాతని క్షమించి, తనవిశాల రాజ్యములో నితరులవలెనే నిరాక్షేపణగ నివసింపవచ్చునని యనుమతించియుండెను. ఈ క్షమాపణకు కూడ విజయుడే కారణమని ఉత్తరము వెనుక భాగముపై వ్రాయబడియుండెను.

నేడు చంద్రగుప్తుని పట్టాభిషేకదినము. తత్కారణమున నాతని సైన్యమంతయు బారులుదీరి, రాజగృహమునకుబోయి, చక్రవర్తింగూడి, యూరేగ సంకల్పింపబడెను. దీనివలన సుశీల మనస్సులో క్రొత్త యాశలు మొలకలెత్తెను. ఈ అనంత సేనాసమూహములో తన విజయుని గుర్తింపవచ్చునను నాశ కల్గెను. ఈ సంగతి తండ్రితో మనవిజేసెను. ఒక యెత్తైన రమ్యహర్మ్యమున తండ్రియు, బిడ్డయు నాసీనులై యుండిరి. సేనావాహిని మెల్ల మెల్లగా కదలివచ్చుచుండెను. మొదట కాల్బలము నడుచుచుండెను. తన మనోనాథుడు అశ్వారూఢు డగునని నమ్మియుండుటచే సుశీల కాల్బలమునంత శ్రద్ధగా చూచియుండలేదు. తదుపరి అశ్వికులు చనుదెంచిరి. సుశీల తదేకదీక్షతో పరిశీలించుచుండెను. కాని విజయుడందును లేడయ్యెను. ఆటుపైని రథములు కదలిపోయెను. అందును విజయుడు లేడయ్యెను. చివరకు చక్రవర్తి యధిష్ఠించియుండిన మత్తగజ మొక్కటియే వెనుకబడియుండెను. సుశీల విజయుని గాంచక పోవుటచే చాల దుఃఖించుచుండెను. ఇంతలో మత్తగజముపై నమర్పబడిన అంబారీయందు చంద్రగుప్తచక్రవర్తి పరివార సమేతుడై యరుదెంచెను. సుశీల యేలాగో ఆతని గాంచినంతనే కంపితగాత్రయై, తన స్థానమునుండి లేవబోడంగెను. తండ్రియు నామె ననుకరించుచుండెను. ఆమె నిదానించి, చూచిచూచి, కెవ్వున నొక కేకవైచి నేల గూలెను. మాధవు డామెనుపట్టుకొని "ఏమమ్మా! అట్లంటివి?" అనెను.



"ఆతడే విజయుడు—నా బాలుని తండ్రి—చక్రవర్తి—తండ్రీ! క్షమింపుము" అని సుశీల ప్రాణముల్విడిచెను.

లోకవృత్తము

పురాణం సూర్యనారాయణ తీర్థులు గారు

ధర బెండువాఱెఁ బాతాళలోకముఁ జేరె సత్యమ్ము ధర్మమా సన్న్యసించె
తపము మున్నైన యుత్తమకృతుల్ వనిఁ జొచ్చెఁ దోలుజాతి వక్త్రచాపలము హెచ్చె
తండ్రితోఁ గొమరుండు తగవాడఁగాఁ బాఱెఁ బ్రభువులందు దురాశ ప్రబల మయ్యె
జఘనచాపలము స్త్రీజాతి కెచ్చుగఁ జేరెఁ బురుషుండు స్త్రీలకింకరతఁ గోరె
కష్టములు చుట్టుకొనుచుండె శిష్టులకును - దుష్టులకుఁ బ్రాభవమ్ము సందృష్ట మయ్యెఁ
గలికిఁ బదునాల్గునెలలైనఁ గాకమునుపె - యిట్టు లగుచుండ నింకముం దెట్టు లగునో?